క్లుప్తంగా

పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథా



పైపులైన్ నుంచి లీకయిన తాగునీరు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేటలోని చెరుకూరి గోడౌన్స్ వద్ద గోదావరి సురక్షిత మంచినీటి పథకం పైపులైన్ లీకేజీతో తాగు నీరు వృథాగా పోతోంది. బొమ్మూరులోని ఆ పథకం నుంచి హుకుంపేట గ్రామానికి ఈ పైపులైన్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. కాగా.. రెండు నెలల క్రితం ఇదే పైపులైన్ లీకేజీకి గురైంది. తరచూ ఈ సమస్య ఏర్పడడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

విశ్వ బ్రాహ్మణులకు ప్రాతినిధ్యం కల్పించాలి



మధుసూదనాచారిని కలిసిన పాడుగు శ్రీను

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలోని చట్ట సభల్లో విశ్వ బ్రాహ్మణులకు ప్రాతినిధ్యం కలిపించేలా జాతీయ స్థాయిలో కృషి చేయాలని తెలంగాణ శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారికి ఆంధ్రప్రదేశ్ విశ్వ బ్రాహ్మణ యువజన సంఘం అధ్యక్షుడు, జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు పాడుగు శ్రీను (గాడాల) విజ్ఞప్తి చేశారు. రాజమహేంద్రవరం వచ్చిన ఆయనను గురువారం కలిసి రాష్ట్రంలో విశ్వ బ్రాహ్మణుల అభ్యున్నతికి జాతీయ స్థాయి నాయకులతో కలసి కేంద్రం దృష్టికి తీసుకుని వెళ్లాలని కోరారు. దానికి మధుసూదనాచారి సానుకూలంగా స్పందించారు. అలాగే ఇటీవల జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడిగా నియమితులైన పాడుగు శ్రీను (గాడాల)ను మధుసూదనాచారిని అభినందించారు.

పల్ల వెంకన్న నర్సరీ సందర్శన



ఆదాయపు పన్ను అధికారి రాజేంద్ర కుమార్‌కు మొక్కల ప్రత్యేకతలను వివరిస్తున్న రైతులు

కడియం: స్థానిక పల్ల వెంకన్న నర్సరీని ఇన్‌కం టాక్స్ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర కుమార్ గురువారం సందర్శించారు. ఆయనకు నర్సరీ రైతులు పల్ల సత్తిబాబు, వెంకటేష్, వినయ్ ఘనంగా స్వాగతం పలికి, వివిధ రకాల మొక్కలను వివరించారు. ఆయన వెంట ఐటీ సెంట్రల్ ప్రిన్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, అడిషనల్ కమిషనర్ సవీష్ వర్మ, కేంద్ర అధికారులు కల్యాణ చక్రవర్తి, ఎల్.రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ తీర్థ మహోత్సవం

రంగంపేట: చంద్రేడు గ్రామంలోని శ్రీదేవి కనక దుర్గమ్మ వార్షిక తీర్థ మహోత్సవాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలు దండలు, విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి ఆలయం వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

కంబాలచెరువు: స్టేడియం రోడ్డుకు చెందిన పాలిశెట్టి సతీష్ (20) ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. స్టేడియం రోడ్డులోని స్వీట్ కవర్ల దుకాణంలో పనిచేసే సతీష్ ఉదయం యథాతథంగా దుకాణానికి వెళ్లాడు. అతడి తల్లి కూడా పని నిమిత్తం బయటకు వెళ్లింది. అయితే సతీష్ కొద్ది సేపటికి ఇంటికి తిరిగి వచ్చి, ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు చేసుకున్నాడు. దీనికి గల కారణాలు తెలియలేదు. రెండో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరిలో వ్యక్తి మృతదేహం

గోదావరిలో సుమారు 40 ఏళ్ల వ్యక్తి మృతదేహం గురువారం కొట్టుకువచ్చింది. స్థానికుల సమాచారం మేరకు టూటౌన్ పోలీసులు ఆ మృతదేహాన్ని బయటకు తీశారు. అతడి ఆచూకీ కోసం ఆరా తీశారు. కొద్దిసేపటి తర్వాత మృతుడు స్థానిక గోరక్షణ పేటకు చెందినవాడుగా తెలిసింది. దీంతో పోలీసులు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి వివరాలు, పేరు తెలియాల్సి ఉంది.

స్పర్శలేని మచ్చతో జాగ్రత్త

- కుష్టువ్యాధి లక్షణం కావొచ్చు
- సకాలంలో మందులు వాడితే నివారణ సాధ్యమే

కంబాలచెరువు: వెంకటేష్‌కు శరీరంపై చిన్న మచ్చ వచ్చింది. మచ్చే కదా అని దాన్ని నిర్లక్ష్యం చేశాడు. ఆ మచ్చ ఏర్పడిన శరీరంపై గిచ్చినా స్పర్శ ఉండడం లేదు. రోజులు గడిచాయి. చేతుల వేళ్లు తినేస్తున్నట్టు తయారయ్యాయి. మరికొద్దిరోజులకు పూర్తిగా అవి కుచించుకుపోవడమే కాకుండా వాటితో పాటు కాళ్లు అలా తయారై పూర్తి అంగవైకల్యం బారిన పడ్డాడు. తర్వాత ఆసుపత్రికి వెళితే అతడికి వచ్చింది కుష్ఠు వ్యాధి అని వైద్యులు తెలిపారు. ఈ విధంగా పలువురు మచ్చ కదా అని వదిలేసి, జీవితాన్ని కష్టాల పాలు చేసుకుంటున్నారు. ఆ వ్యాధిని ప్రాథమిక స్థాయిలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు.

ఆరోగ్యమే మహాభాగ్యం

ఆరోగ్యమే మహాభాగ్యమని పెద్దలు చెబుతారు. మనిషికి ఆరోగ్యమే అసలైన సంపద అని దాని అర్థం. నేడు అనేక రకాల రోగాలు మనపై దాడి చేస్తున్నాయి. దానికి కారణాలు ఏమైనప్పటికీ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి. రోగాల నుంచి ప్రజలను కాపాడటానికి వైద్య, ఆరోగ్య శాఖ అనేక చర్యలు చేపడుతోంది. దానికి ప్రజలు సహకరిస్తే చాలు. కుష్టు వ్యాధి సర్వేను వైద్య సిబ్బంది విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఇంటింటికి ప్రజలను సర్వే చేస్తున్నారు. శరీరంపై అనుమానాస్పద మచ్చలు ఉంటే గుర్తించి, వైద్య చికిత్స అందిస్తున్నారు.



కుష్టు వ్యాధిపై సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

లక్షణాలు ఇవీ..

- చర్మంపై స్పర్శ, నొప్పి, దురద లేని మచ్చలు
- చర్మంపై ఎరుపు, రాగి రంగు మచ్చలు
- చెవులు, వీపు, ఛాతీపై బొడిపెలు
- కనురెప్పలు పూర్తిగా మూయలేకపోవడం, కంటి రెప్పలు, కనుబొమ్మల వెంట్రుకలు రాలిపోవడం
- నరాల నొప్పి, చేతులు, పాదాలు, నరాల తిమ్మిర్లు
- అర చేతులు, పాదాలలో స్పర్శ కోల్పోవడం, పొడి బారడం, నొప్పి, పుండ్లు ఏర్పడడం, చేతి, కాళ్ల వేళ్ల వంకర్లు తిరిగి అంగవైకల్యం ఏర్పడడం
- కాళ్ల నుంచి చెప్పులు, చేతుల నుంచి వస్తువులు జారిపోవడం
- మణికట్టు, మడమను పైకి లేపలేకపోవడం
- చల్లని, వేడి వస్తువులను తాకినా గుర్తించలేకపోవడం.

స్పర్శలేని మచ్చలుంటే..

శరీరంపై ఉండే మచ్చలలో స్పర్శ లేకుండా ఉన్నవి ప్రమాదకరం. వీటి వల్ల కుష్టు వ్యాధి బారిన పడే అవకాశం ఉంది. ప్రాథమిక దశలోనే అలాంటి మచ్చలను గుర్తిస్తే చికిత్స తీసుకుని, సమస్య నుంచి బయటపడవచ్చు. కుష్టు అనే మాట వింటేనే ఒకసారిగా గుండెల్లో ఏదో తెలియని భయం. ఈ వ్యాధి నిర్మూలనకు, ప్రజల్లో అవగాహనకు, కుష్టు రహిత సమాజాన్ని నిర్మించేందుకు వైద్య ఆరోగ్య శాఖ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలు అప్రమత్తం చేస్తోంది.

విస్తృతంగా సర్వే

జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ పేరుతో రాజమహేంద్రవరంలో వ్యాధిగ్రస్తులను గుర్తించే చర్యలు చేపట్టారు. అనుమానిత కేసులను గుర్తించే పనిలో వైద్య సిబ్బంది బిజీగా మారారు. ఇంటింటికీ తిరిగి అనుమానిత మచ్చలున్న వారిని గుర్తిస్తున్నారు. అలాగే బ్యానర్లు, పోస్టర్లు, పాంపెట్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కుష్టువ్యాధి వల్ల కలిగే అనర్థాలను వివరించి, దానిని గుర్తించడం వల్ల కలిగే ముందస్తు ప్రయోజనాలను ర్యాలీల ద్వారా తెలియజేస్తున్నారు. రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో సుమారు నాలుగు లక్షల మందిని వైద్య సిబ్బంది సర్వే చేశారు. వారిలో ఇప్పటి వరకు కుష్టు వ్యాధి సోకిన పదిమందిని గుర్తించారు.

నిర్లక్ష్యం చేయవద్దు



కుష్టు అనేది ప్రమాదకరమైంది కాదు. శరీరంపై అనుమానిత మచ్చలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా ధైర్యంగా ముందుకు రావాలి. చాలా మంది మచ్చే కదా అని వదిలేస్తున్నారు. తర్వాత ఆసుపత్రికి వస్తున్నారు. ఈ లోపు జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. సర్వే ద్వారా చాలామంది వ్యాధిగ్రస్తులు బయటపడుతున్నారు. కుష్టు వ్యాధిని ముందుగా గుర్తిస్తే దాని నివారణ సులభం. వ్యాధి సోకిన వారు తుమ్మినా, దగ్గినా ఆ తుంపర్ల నుంచి మరో వ్యక్తికి వ్యాధి సంక్రమించే అవకాశం ఉంది. సక్రమంగా మందులు వాడితే నయం చేసుకోవచ్చు.

– నిమ్మి వసుంధర, జిల్లా కుష్టువ్యాధి నిర్మూలన అధికారి

వైభవంగా శివపార్వతుల రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న ఈఓ రాజబాబు తదితరులు

సీటీఆర్ఐ: గోదావరి గట్టున గల ఉమా మార్కండయేశ్వరస్వామి ఆలయంలో శివ రాత్రి ముగింపు వేడుకలలో భాగంగా గురువారం సాయంత్రం శివ పార్వతుల రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ రాజబాబు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తుల హరహర మహాదేవ, శంభో శంకర అనే నినాదాల మధ్య భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన పూజారి నీలకంఠశర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

హండ్రెడ్ ఫీట్ రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు



హండ్రెడ్ ఫీట్ రోడ్డులో లారీలను ఆపి వేసిన ట్రాఫిక్ పోలీసులు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలోని హండ్రెడ్ ఫీట్ రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలతో ఎస్‌వీ జనరల్ మార్కెట్ వ్యాపారులతో పాటు లారీ యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ రోడ్డులో ఉదయం 9 నుంచి రాత్రి పది గంటల వరకూ ఎస్‌వీ మార్కెట్‌లోకి వచ్చే లారీలకు అనుమతి లేదంటూ గురువారం ఉదయం ట్రాఫిక్ పోలీసులు ఆపివేశారు. దీంతో మధ్యాహ్నం 12 గంటల వరకూ సుమారు 20 లారీలు నిలిచిపోయాయి. గతంలో మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉండేవి. ఇప్పుడు మరింత సమయం పెంచడంతో వ్యాపారాలు మూసుకోవాల్సి వస్తుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లారీ యజమానులు సైతం గంటల తరబడి లారీలను నిలుపదల చేస్తే డ్రైవర్లు, క్లీనర్లకు జీతాలు ఎలా చెల్లించాలంటున్నారు. కానీ ట్రాఫిక్ పోలీసులు మాత్రం ట్రాఫిక్ ఆంక్షలను తప్పనిసరిగా పాటించి తీరాల్సిందేనని చెబుతున్నారు. చివరకు మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ట్రాఫిక్ పోలీసులు ఆ లారీలకు జరిమానా విధించి ఎస్‌వీ జనరల్ మార్కెట్ లోకి వదిలారు.

స్వచ్ఛంద సేవా సంస్థల కృషి అమూల్యం



స్వర్ణాంధ్ర సంస్థలో కేక్ కట్ చేస్తున్న గుబ్బల రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ: సమాజంలో పౌరుల తక్షణ అవసరాలు తీర్చడానికి స్వచ్ఛంద సేవా సంస్థలు చేస్తున్న కృషి అమూల్యమైనదని స్వర్ణాంధ్ర సేవా సంస్థ ముఖ్య నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు అన్నారు. అంతర్జాతీయ ఎన్జీవో దినోత్సవం సందర్భంగా గురువారం లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో సుమారు 40 స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల మధ్య పరిచయం, సమన్వయం సాధించడం కోసం పూర్వపు ఉభయ జిల్లాల స్వచ్ఛంద సేవా సంస్థలతో ఒక డైరెక్టరీని రూపొందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అనూప్, జోషి బాబు, ప్రభుదాస్, పోసి కుమార్, మద్దాల అను, రాజయోనా, శకుంతల, లక్ష్మణ రావు, రుద్రమదేవి, సురేష్, కుసుమ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గోవుల అక్రమ రవాణాను అరికట్టాలి



ఎస్పీని కలిసేందుకు వెళుతున్న భారతానంద్ మహారాజ్, ఇతర గోరక్షకులు

కంబాలచెరువు: గోవుల అక్రమ రవాణాను అరికట్టాలని భారత్ శక్తిపీఠం అధ్యక్షుడు, హిందూ మహా సభ దక్షిణ భారత ఆర్గనైజింగ్ సెక్రటరీ భారతానంద్ మహారాజ్ అన్నారు. విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వచ్చిన ఆయన గోవుల అక్రమ రవాణాపై గురువారం జిల్లా ఎస్పీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోవుల అక్రమ రవాణాను పోలీస్ శాఖ వారే ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. పశువుల అక్రమ రవాణా చేస్తున్న నిందితులకు రాజానగరం పోలీసులు సహకారం అందిస్తున్నారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ గోహత్య నిషేధ చట్టం, జంతు సంరక్షణ చట్టం 1970 ప్రకారం రాజానగరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20న గోవుల అక్రమ రవాణా జరుగుతున్న సంఘటనపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించామన్నారు. అయితే ఈ నెల 26వ తేదీన ఒక కంటైనర్‌లో సుమారు 40 వరకు ఆవులను ఇరికించి రవాణా చేస్తున్నారన్నారు. ఆ వాహనాన్ని హిందూ గో సేవా సమితి సభ్యుడు, గోశాల నిర్వాహకుడు మోటుపల్లి సాయి.. తమ గ్రూపులో రాబడిన సమాచారం మేరకు 112 కాల్ చేసి పోలీసు వారి సహకారంతో ఆవుల అక్రమ రవాణాను అడ్డుకొని పోలీసులకు అప్పగించడన్నారు. అయితే రాజానగరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంటనే వాహనాన్ని స్టేషన్‌కు తరలించకుండా రోడ్డుమీద ఆపి మాఫియాకు అనుగుణంగా మాట్లాడారని ఆరోపించారు. మాఫియాకి సహాయం చేసి ఆ వాహనాన్ని విడిచి పెట్టినందుకు సీఐను సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో అమ్మానాన్న సేవా సమితి సంస్థ నెల్లూరు కావలికి చెందిన మంగళగిరి వేణుగోపాలరావు, సాధువులు, సన్యాసులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వినోద్

సీతానగరం: మండలంలోని వంగలపూడి రేవు నుంచి పట్టిసీమ వీరభద్రుని దర్శనానికి వెళ్లి, తిరిగి వస్తున్న యువకుడికి ట్రాక్టర్ ప్రమాదంలో తీవ్రగాయమైంది. వివరాల్లోకి వెళితే.. రాజానగరానికి చెందిన 25 ఏళ్ల ఎం.వినోద్ గురువారం తెల్లవారుజాము 2.30 గంటలకు పట్టిసీమ నుంచి వంగలపూడి రేవుకు ట్రాక్టర్‌పై తిరిగి వస్తున్నాడు. తన ఐదుగురి స్నేహితులతో పాటుగా ట్రాక్టర్ ట్రక్కు శివారున కూర్చున్నాడు. ఆ సమయంలో ఎదురుగా వచ్చిన మరో ట్రాక్టర్ వీరి ట్రక్కును రాసుకుంటూ వెళ్లిపోయింది. రెండింటి మధ్య వినోద్ కాలు చిక్కుకుపోయింది. ఈ ప్రమాదంలో ఎడమ కాలు మడం పైభాగంలో ఎముక బయటకు వచ్చింది. అదే ట్రక్కుపై ఉన్న రాజమహేంద్రవరం రూరల్ తొర్రేడుకు చెందిన ప్రశాంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ ఈఎంటీ ముత్యం శ్రీనివాస్, పైలట్ లక్ష్మణ్.. బాధితులకు ప్రథమ చికిత్స చేసి రాజమహేంద్రవరంలోని ప్రవేటు ఆస్పత్రికి తరలించారు. ఆ ఆస్పత్రిలోనే ల్యాబ్ టెక్నీషియన్ వినోద్ పనిచేస్తున్నాడు.



ఓటుహక్కును వినియోగించుకున్న రౌతు సూర్యప్రకాశరావు, తనయుడు వరుణ్



వీరభద్రపురం సిటీ మున్సిపల్ హైస్కూల్‌కు ఓటు వేసేందుకు వస్తున్న దివ్యాంగుడు, అంధుడు



డీఎంహెచ్ స్కూల్లో ఓటు వేస్తున్న మాజీ ఎంపీ హర్ష కుమార్



ధవళేశ్వరంలో క్యూలో వేచి ఉన్న మహిళా పట్టభద్రులు

పట్టం కట్టేదెవ్వరికో..

- ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్
- ఓటుహక్కును వినియోగించుకున్న పట్టభద్రులు

రాజమహేంద్రవరం రూరల్/ధవళేశ్వరం: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా జరిగింది. రూరల్ మండలంలో 63.47 శాతం పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని ధవళేశ్వరం, కొంతమూరు, హుకుంపేట, బొమ్మూరు పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్, రాజమండ్రి ఆర్‌డీవో కృష్ణ నాయక్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. బొమ్మూరులో మధ్యాహ్నం నాలుగు గంటలతో పోలింగ్ ముగిసినప్పటికీ ఓటర్లు మిగిలి ఉండడంతో గేటు వేసేసి సుమారు 80 మందికి స్లిప్పులు ఇచ్చి ఓటు వేసే అవకాశం కల్పించారు. పోలింగ్ కేంద్రాలను ఇండిపెండెంట్ అభ్యర్థి జీవీ సుందర్, మాజీ ఎంపీ హర్షకుమార్ పరిశీలించారు. మండలంలో 6,409 మందికి గాను 4,068 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని తహసీల్దార్ సూర్యనాగకుమార్ తెలిపారు.



బొమ్మూరులో ఓటు వేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు



వీల్‌చైర్‌లో ఓటు వేసేందుకు వస్తున్న మహిళ

71.86 శాతం పోలింగ్

కడియం: మండలంలోని రెండు కేంద్రాల్లో 71.89 శాతం పోలింగ్ నమోదైంది. తహసీల్దార్ కార్యాలయం వద్ద 989 మంది ఓటర్లకుగాను 685 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద 916 మందికి 684 మంది ఓటు వేశారు. మొత్తం 1,905 మందికీ 1,369 మంది ఓటు వేశారు. కడియంలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో మధ్యాహ్నం 12 గంటల వరకు మందకొడిగానే పోలింగ్ సాగింది. నిర్ణీత సమయం తరువాత కేంద్రం లోపల ఉన్నవారికి స్లిప్పులు అందజేసి, పోలింగ్ ప్రక్రియను కొనసాగించారు. ఆయా కేంద్రాలను మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ మంత్రి కేఎస్ జవహర్, పలువురు ఎమ్మెల్సీ అభ్యర్థులు సందర్శించారు. కాగా.. కూటమి అభ్యర్థులు తమకు ట్రాన్స్‌పోర్టు ఛార్జీలు ఇస్తామని రప్పించి, తీరా ఇక్కడకు వచ్చాక ముఖం చాటేశారని పలువురు ఓటర్లు వాపోవడం పోలింగ్ కేంద్రాల వద్ద కనిపించింది.

నగరంలో అత్యల్పం

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం అర్బన్ లో పోలింగ్ 42.86 శాతం నమోదైంది. ఉదయం 8 నుంచి మందకొడిగా జరిగి, మధ్యాహ్నం 12 గంటలకు 25 శాతం మాత్రమే నమోదైంది. మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా ఊపందుకుంది.



కడియం పంచాయతీ కార్యాలయం వద్ద బారులు దీరిన పట్టభద్రులు



బొమ్మూరులో మధ్యాహ్నం నాలుగు గంటల తర్వాత పోలింగ్ కేంద్రం గేటు మూసివేస్తున్న సిబ్బంది



దానవాయిపేట మున్సిపల్ హైస్కూల్లో క్యూ